# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 24-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ మహిళలు సాధికారత సాధించినప్పుడు సమాజం మరింత పటిష్టంగా మారుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
- ❖ కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ఇటీవల రిజర్వేషన్ల పై చేసిన వ్యాఖ్యల నేపధ్యంలో పార్లమెంటులో ఈరోజు గందరగోళం నెలకొంది.
- ❖ కేంద్ర ఆర్థిక శాఖ నూతన కార్యదర్శిగా అజయ్ సేథ్ నియమితులయ్యారు.
- ❖ ఉల్లి ఎగుమతులపై ఉన్న 20 శాతం కస్టమ్స్ సుంకాన్ని తొలగించామని కేంద్ర వ్యయసాయ శాఖా మంత్రి శివ రాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు.

===========================

మహిళలు సాధికారత సాధించినప్పుడు సమాజం మరింత పటిష్టంగా మారుతుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈరోజు రాయ్‌పూర్‌లో జరిగిన ఛత్తీస్‌గఢ్ శాసనసభ రజతోత్సవ వేడుకలకు రాష్ట్రపతి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రసంగిస్తూ.. వామపక్ష తీవ్రవాదం బారిన పడిన ప్రజలను సమాజ ప్రధాన స్రవంతిలోకి తీసుకువచ్చే మహత్తర కార్యక్రమం చివరి దశకు చేరుకుందన్నారు. వివిధ రంగాలలో పనిచేసే మహిళలను ప్రోత్సహించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని మహిళా శాసనసభ్యులకు రాష్ట్రపతి సూచిస్తూ....

(వాయిస్ 32 సెకన్లు)

===========================

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ ఇటీవల రిజర్వేషన్ల పై చేసిన వ్యాఖ్యల నేపధ్యంలో పార్లమెంటులో ఈరోజు గందరగోళం నెలకొంది. దీంతో ఉభయ సభలు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడ్డాయి. అంతకముందు రాజ్యసభలో సభా నాయకుడు జె. పి. నడ్డా మాట్లాడుతూ.. ఈ వ్యాఖ్యల ద్వారా కాంగ్రెస్ పార్టీ

రాజ్యాంగాన్ని బలహీనపరుస్తోందని అన్నారు. దీనిపై ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున్ ఖర్గే స్పందిస్తూ.. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని ఎవరూ మార్చలేరని.. దేశంలో రిజర్వేషన్లను ఎవరూ అంతం చేయలేరని పేర్కొన్నారు. అనతరం గందరగోళం చెలరేగడంతో రాజ్యసభ  ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. మధ్యాహ్నం 12 గంటలకు సభ వాయిదా పడిన తర్వాత లోక్ సభ తిరిగి సమావేశమైనప్పుడు మతం ఆధారంగా రిజర్వేషన్ల అంశం 1947లోనే వచ్చిందని, ప్రముఖ నాయకులందరూ దీనిని అప్పట్లోనే తిరస్కరించారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజిజు ప్రస్తావించారు.

==========================

ఉల్లి ఎగుమతులపై ఏప్రిల్ 1 నుంచి 20 శాతం కస్టమ్స్ సుంకాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కేంద్ర వ్యయసాయ శాఖా మంత్రి శివ రాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈ నిర్ణయం రైతుల ఆదాయాన్ని మరింత పెంచుతుందని అన్నారు. ఉల్లిపాయలపై ఎగుమతి సుంకాన్ని తొలగించడం వల్ల రైతులు కష్టపడి సంపాదించిన ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు సుంకం లేకుండా చేరుకుంటాయని శివ రాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ....

(వాయిస్ 35 సెకన్లు)

==========================

కేంద్ర ఆర్థిక శాఖ నూతన కార్యదర్శిగా అజయ్ సేథ్ నియమితులయ్యారు. అజయ్ సేథ్‌ను ఆర్థిక కార్యదర్శిగా నియమించడానికి క్యాబినెట్ నియామకాల కమిటీ ఈరోజు ఆమోదం తెలిపింది. కర్ణాటక కేడర్‌కు చెందిన 1987 బ్యాచ్ IAS అధికారి అయిన అజయ్ సేథ్ ప్రస్తుతం ఆర్థిక వ్యవహారాల శాఖ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఇటీవల సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (SEBI) ఛైర్మన్‌గా తుహిన్ కాంత్ పాండే నియామకంతో ఏర్పడిన ఖాళీని అజయ్ సేథ్ భర్తీ చేయనున్నారు. కాగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖలో అత్యంత సీనియర్ కార్యదర్శిని ఆర్థిక కార్యదర్శిగా నియమించడం ఆనవాయితీగా వస్తోంది.

విరామం

==========================

వినూత్నమైన కథలు, వినోదం కోసం ఎదురుచూస్తున్న ప్రపంచ వినోద పరిశ్రమను  విప్లవాత్మకంగా మార్చడానికి భారత్ సిద్ధమవుతోంది. వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (WAVES) మే 1 నుండి 4వ తేదీ వరకూ ముంబైలో జరగనుంది. ఇది మీడియా రంగానికి సంబంధించిన ఒక సదస్సుగా మాత్రమే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సృష్టికర్తలు, విధాన రూపకర్తలు కంటెంట్‌తో ఎలా నిమగ్నమవుతారో పునర్నిర్వచించే పరివర్తనాత్మక దృష్టిని సూచిస్తోంది. కంటెంట్ సృష్టికర్తల ఎకో సిస్టమ్ కోసం సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ చేపట్టిన ఈ కార్యక్రమం అత్యంత ప్రాచుర్యం పొందుతోంది.

==========================

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ సేవలను ఉపసంహరించుకుంది. ఆయనను న్యాయపరమైన విధులకు దూరంగా తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా న్యాయమూర్తి యశ్వంత్ వర్మను తిరిగి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించింది. కాగా న్యాయమూర్తి అధికార నివాసంలో అగ్నిప్రమాదం జరగడంతో.. ఆర్పేందుకు వెళ్లిన సిబ్బందికి అనుకోకుండా అక్కడ భారీగా నోట్ల కట్టలు కనిపించడంతో వివాదం నెలకొంది.

==========================

దేశంలోని మొత్తం అటవీ విస్తీర్ణం 8 లక్షల 27 వేల చదరపు కిలో మీటర్లకు పైగా ఉందని కేంద్ర పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖా మంత్రి భూపేంద్ర యాదవ్ తెలిపారు. ఈరోజు లోక్‌సభలో ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ... ప్రస్తుత అటవీ విస్తీర్ణం దేశ భౌగోళిక విస్తీర్ణంలో 25 శాతంగా ఉందన్నారు. 2021 తుది అంచనాలతో పోలిస్తే ఇది 1,445 చదరపు కిలోమీటర్లకు పైగా పెరిగిందని భూపేంద్ర యాదవ్ వెల్లడించారు.

==========================

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై అభ్యంతకరమైన వ్యాఖ్యలు చేసినందుకు గానూ స్టాండ్-అప్ కమెడియన్ కునాల్ కమ్రాపై ముంబై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దాదాపు 2 నిమిషాల నిడివి గల ఈ వీడియోలో కునాల్ కమ్రా అధికార ఎన్సీపీ, శివసేనపై చేసిన వ్యాఖ్యలపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు. మరోవైపు ఈ వ్యాఖ్యలను నిరసిస్తూ ముంబైలోని ఖార్ ప్రాంతంలో షో నిర్వహించిన స్టూడియోను ధ్వంసం చేసినందుకు దాదాపు 40 మంది శివసేన కార్యకర్తలపై కూడా పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

==========================

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) లో భాగంగా విశాఖపట్నం వేదికగా ఈరోజు జరుగుతున్న లఖ్‌నవూ సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యా పిటల్స్ జట్ల మధ్య కొద్ది సేపటి క్రితం మ్యాచ్ ప్రారంభమైంది. తొలిత టాస్ గెలిచి ఢిల్లీ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. కడపటి వార్తలు అందే సమయానికి లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ జట్టు 12 ఓవర్లకు 2 వికెట్ నష్టానికి 134 పరుగులు చేసింది.

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

==========================

రాబోయే 3 నుండి 4 రోజుల్లో జమ్మూ కాశ్మీర్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్‌లలో ఉరుములు మెరుపులతో కూడిన వారావరణ పరిస్థితులు ఉంటాయని భారత వాతావరణ శాఖ (IMD) వెల్లడించింది. కర్నాటక, గుజరాత్ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలలో రేపు వేడి తేమతో కూడిన వాతావరణం ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్త అమిత్ కుమార్ తెలియజేస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

==========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 76 వేల 905 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరికి 1078 పాయింట్లతో 77 వేల 984 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 307 పాయింట్లు లాభపడి 23 వేల 658 వద్ద ముగిసింది.

==========================
==========================